సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



హోరాహోరీగా ఖోఖో పోటీలు

భువనగిరిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు రెండో రోజు శనివారం హోరాహోరీగా కొనసాగాయి. - 8లో



అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్

ఉదయం రెక్కీ నిర్వహించి రాత్రి చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



ముమ్మరంగా షాపింగ్ కాంప్లెక్స్..

మోత్కూరులో నిర్మిస్తున్న రైతు సేవా సహకార సంఘం షాపింగ్ కాంప్లెక్స్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. - 9లో

న్యూస్‌రీల్

బోధన సిబ్బంది పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి : ఎస్‌సీఈఆర్‌టీ(రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి)లో డిప్యూటేషన్, ఓడీ విధానంలో పని చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్ డిగ్రీ, ఎంఈడీ పూర్తి చేసి, బోధనలో పదేళ్ల అనుభవం ఉన్నవారు అర్హులన్నారు. వయస్సు 58 సంవత్సరాలకు మించి ఉండరాదన్నారు. మానసత్త్వ శాస్త్రం 1, తత్వ శాస్త్రం 1, సామాజిక శాస్త్రం 1, గణితం 3, ఫిజిక్స్ 3, జువాలజీ 3, సోషల్ 3, తెలుగు 3, ఇంగ్లీష్ 3, ఉర్దూ 2, హిందీ 1, ఐసీటీ 3, శారీరక విద్యలో ఒకటి చొప్పున ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అర్హత, అసక్తి కలిగిన వారు స్కూల్ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్‌సైట్‌లో ఆదివారం (నేడు)నుంచి ఈనెల 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



పరీక్ష పేపర్లను పరిశీలిస్తున్న డీఈఓ

భువనగిరి : పదవ తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ నారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం భువనగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రి ఫైనల్ పరీక్షను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మార్చి 18నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని, ప్రణాళికాబద్ధంగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. సబ్జెక్టుల్లో ఎలాంటి సందేహాలున్నా ఉపాధ్యాయుడి ద్వారా నివృత్తి చేసుకోవాలన్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు బోధన చేసే ఉపాధ్యాయులతో సమావేశమై టెన్త్‌లో ఉత్తమ మార్కుల సాధనకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు.

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

భువనగిరి : సాంఘిక సంక్షేమ ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలల్లోని ఇంగ్లిష్ మీడియంలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం అదివారం అర్హత పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరగనుంది. జిల్లాలో ఏడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 2,330 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పర్యవేక్షణకు ఏడుగురు చీఫ్ సూపరింటెండెంట్‌లు, డీఓలను నియమించారు. పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేశామని, విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు కోరారు.

యాదాద్రిలో నిత్యారాధనలు



గజవాహన సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున శ్రీస్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ, స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. అనంతరం ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం జోడు సేవలను ఊరేగించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచన పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

సంక్షేమానికి గ్యారంటీ!

- ఎన్నికల హామీలకు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రాధాన్యం
- ఆయా పథకాలతో జిల్లా ప్రజలకు చేకూరనున్న ప్రయోజనం
- నియోజకవర్గానికి 3,500 ఇళ్లతో పేదలకు మేలు
- మూసీనది ప్రక్షాళనకు నిధులు
- చేనేతకు అండగా నిలుస్తామని ప్రకటన
- హైదరాబాద్ శివారులో జోన్ల వారీగా అభివృద్ధి
- యాదాద్రి ఆలయ ప్రస్తావన లేదు



సాక్షి, యాదాద్రి : రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చింది. సంక్షేమ రంగానికి పెద్ద పీట వేసింది. యాదాద్రి భువనగిరి జిల్లా అభివృద్ధిని ప్రతిబింబించే విధంగా పట్టణీకరణ, మూసీ ప్రక్షాళన, చేనేతకు చేయూత, రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణ, టెంపుల్ టూరిజంలోకి కొలనుపాకను చేర్చింది. అయితే, యాదాద్రి పుణ్యక్షేత్రం అభివృద్ధి గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో చేపట్టిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రభుత్వం చెప్పింది. ఆ ప్రాజెక్టునే గత ప్రభుత్వం కాళేశ్వరంగా పేరుమార్చిన విషయం తెలిసిందే. భువనగిరి జిల్లాలోని బస్వాపూర్ ప్రాజెక్టు ప్రాణహిత–చేవేళ్లలో భాగమే.

నియోజకవర్గానికి 3,500 ఇళ్లు

ఇందిరమ్మ ఇంటి పథకం కింద ప్రతి నియోజకవర్గానికి ఏడాదికి 3500 చొప్పున మంజూరు చేస్తామని బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఇటీవల ప్రజాపాలనలో ఇళ్ల కోసం భువనగిరి, ఆలేరు, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాల పరిధిలో 2,09,574 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అర్హులకు సొంతింటి కల నెరవేరనుంది.

గృహజ్యోతి, మహాలక్ష్మితో..



ప్రభుత్వం గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనుంది. భువనగిరి జిల్లా వ్యాప్తంగా 2,09,899 మంది ఈ పథకానికి ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ఇటీవల అర్హుల లెక్కలు తీస్తోంది. రూ.500 గ్యాస్ సిలిండర్ పథకానికి 2,30,412 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ఈ రెండు పథకాలను ప్రస్తుతం అమలు చేయడానికి చర్యలు ప్రారంభించింది. మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.2500 నగదుకు 2,32,053 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి త్వరలో లబ్ధి జరగనుంది.

ఆసరాతో పెరగనున్న ప్రయోజనం

భువనగిరి జిల్లాలో ప్రస్తుతం వివిధ పింఛన్ల కింద 1,03,384 మంది లబ్ధిదారులు రూ.27.75 కోట్లు పొందుతున్నారు. కొత్త ప్రభుత్వం పింఛను మొత్తాన్ని పెంచి అందిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. జిల్లాలో ప్రస్తుతం పింఛను పొదుతున్న వారితో పాటు ప్రజాపాలలో దరఖాస్తులు చేసుకున్న సుమారు 65,680 మందిలో అర్హులకు చేయూత లభించే అవకాశం ఉంది.

మూసీ ప్రక్షాళనకు రూ.వెయ్యి కోట్లు



మురికికూపంగా మారిన మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయించింది. మూసీ నీటిలోని కాలుష్యాన్ని తొలగిస్తామని ప్రకటించింది. దీంతో బీబీనగర్, పోచంపల్లి, భువనగిరి, వలిగొండ, రామన్నపేట, మోత్కురు మండలాల్లోని రైతులు, మత్స్యకారులు, చేనేత వంటి వృత్తిదారులకు మేలు జరుగుతుంది.

‘రీజినల్’కు నిధులు

రీజినల్ రింగ్ రోడ్డు భూసేకణను వేగవంతం చేయడానికి నిధులు కేటాయించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో జిల్లాలోని భూసేకరణ ప్రక్రియను వేగవంతం కానుంది. రైతులకు పరిహారం చెల్లించడానికి నిధులు కేటాయించనున్నారు.

యాదాద్రికి దక్కని ప్రాధాన్యం

టెంపుల్ టూరిజానికి బడ్జెట్‌లో ప్రభుత్వం పెద్ద పీట వేసింది. అయితే, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించిన టెంపుల్ టూరిజం సర్క్యూట్‌లో యాదాద్రి పుణ్యక్షేత్రానికి ప్రాధాన్యం దక్కలేదు. వేములవాడ, భద్రాచలం, బాసర, జమాలపురం(చిన్నతిరుపతి), ధర్మపురిలను అనుసంధానం చేశారు. భువనగిరి జిల్లా లోగల ప్రసిద్ధ జైన దేవాలయాన్ని సర్క్యూట్‌లో చేర్చారు. యాదాద్రి ఆలయన అభివృద్ధికి నిధులు కేటాయిస్తారని భావించినా అది జరుగలేదు.

అభివృద్ధి వికేంద్రీకరణకు జోన్‌లు

అభివృద్ధి వికేంద్రీకరణపై ప్రభుత్వం ప్రటకన చేసింది. హైదరాబాద్ ఓఆర్ఆర్, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతాన్ని పెరి అర్బన్ జోన్‌గా, రీజినల్ రింగ్ రోడ్డు తర్వాత ప్రాంతాన్ని రూరల్ జోన్‌గా గుర్తించారు. పెరి అర్బన్ జోన్‌లో బహుళ అంతస్తుల భవనాలు, మల్టీప్లెక్స్ సినిమాథియేటర్లు, షాపింగ్ కాంప్లెక్స్, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు రానున్నాయి. చౌటుప్పల్, వలిగొండ, పోచంపల్లి, బీబీనగర్, భువనగిరి, యాదగిరిగుట్ట, తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాలు పెరి అర్బన్ జోన్‌లో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రైతుకు భరోసా..

రైతు భరోసాతో రైతులకు, కౌలు రైతులకు ఏడాదికి ఎకరానికి రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రైతుబంధు కింద 2,71,979 మందికి ప్రస్తుతం ఎకరాకు రూ.5 వేల చొప్పున ప్రతి సీజన్‌లో రూ.304 కోట్లు అందుతున్నవి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని రైతు భరోసాగా మార్చుచేసి నగదు పెంచింది. ఈ పథకం కింద ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న 2,59,123 మందితో పాటు ఇప్పటికే జిల్లాలో రైతుబంధు పొందుతున్న రైతులు, కౌలు రైతులు, రైతు కూలీలు లబ్ధిపొందనున్నారు.

రుణమాఫీకి ఎదురుచూపే..

రాష్ట్రం బడ్జెట్‌లో రూ.2లక్షల రుణ మాఫీకి ప్రత్యేకించి నిధులు కేటాయించ లేదు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన రూ.లక్ష లోపు రుణాల మాఫీ హామీలో భాగంగా 59,726 మంది రైతులకు రూ.364.75 కోట్లు వ్యవసాయ రుణాలను మాఫీ చేసింది. ఎన్నికల కోడ్ రావడంతో రుణమాఫీ ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. సుమారు లక్షమంది రైతులకు రుణ విముక్తి కోసం ఎదురుచూస్తున్నారు. అయితే, రూ.2లక్షల రుణమాఫీకి కసరత్తు జరుగుతుందని ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించింది.

నేతన్నలకు చేయూత

నేతన్నల నుంచి వస్త్రాల కొనుగోలుకు బడ్జెట్‌లో హామీ లభించడంతో చేనేత కుటుంబాలకు ఊరట లభించనుంది. స్కూల్ యూనిఫాంల వస్త్రాన్ని నేతన్నల నుంచి కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. భువనగిరి జిల్లాలో సుమారు 20 వేల మంది ఈ రంగంలో ఉన్నారు. పోచంపల్లి, రామన్నపేట, ఆలేరు, రాజాపేట, చౌటుప్పల్, నారాయణపురం మండలాల్లో వస్త్రాలను తయారు చేస్తున్నారు.



అసెంబ్లీలో శనివారం మంత్రి భట్టి విక్రమార్కతో ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, వేముల వీరేశం తదితరులు

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం తగ్గింది



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో సంక్షేమానికి ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చింది. ఇందుకోసం రూ.56,196 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేస్తూ నిధులు కేటాయించింది. మనది వ్యవసాయ అధారిత రాష్ట్రం. కానీ, వ్యవసాయానికి కేవలం రూ.19,746 కోట్లు కేటాయించారు. వ్యవసాయానికి ఎక్కువ నిధులు కేటాయించాలి. దాంతో పాటు పారిశ్రామిక, విద్య, వైద్య రంగానికి ఎక్కువ నిధులు కేటాయించాల్సి ఉన్నా.. బడ్జెట్‌లో అది కనిపించలేదు.

–వి.మౌనిక, అర్థశాస్త్ర అధ్యాపకురాలు, భువనగిరి

పథకాల అమలు హర్షణీయం



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500 గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్కు నిధులు కేటాయించడం హర్షణీయం. ఇంటి స్థలం ఉన్న వారు ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు ఇవ్వడంతో పేదలకు మేలు కలుగుతుంది.

– దేశిరెడ్డి సులోచన, అక్కంపల్లి, వలిగొండ

ఆశాజనకంగా లేదు



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆశాజనకంగా లేదు. రైతులకు ప్రయోజనం చేకూరేలా కన్పించడం లేదు. రైతు ప్రభుత్వంగా చెప్పుకుంటున్నప్పటికీ బడ్జెట్ కేటాయింపు చూస్తే అందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. నీటిపారుదల రంగానికి సైతం అంతంతగానే నిధులు కేటాయించారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తవ్వాలంటే బడ్జెట్‌లో పెట్టిన నిధులు ఏమూలకు కూడా సరిపోవు. వ్యవసాయానికి, సాగునీటి ప్రాజెక్టులకు కేటాయించిన రూ.47,770 కోట్ల నిధులను రెట్టింపు చేయాలి.

–దీటీ మాధవరెడ్డి, రైతు సంఘం నాయకుడు

కృష్ణా జలాల పరిరక్షణకు ఉద్యమం



నల్లగొండ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు విద్యాసాగర్‌రావు, గొంగిడి సునీత, బూడిద భిక్షమయ్యగౌడ్, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి తదితరులు

యాదగిరిగుట్ట : కృష్ణా జలాల పరిరక్షణకు చేపట్టే ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఆలేరు మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, బూడిద భిక్షమయ్యగౌడ్, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 13న నల్లగొండలో నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభ పోస్టర్‌ను శనివారం యాదగిరిగుట్టలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల కృష్ణా ప్రాజెక్టులు కేంద్రం పరిధిలోకి వెళ్లాయని, వాటిని సాధించుకోవడానికి కేసీఆర్ ఆధ్వర్యంలో ఉద్యమానికి సిద్ధమైనట్లు తెలిపారు. కేసీఆర్‌కు మద్దతుగా ఆలేరు నియోజకవర్గంలోని ప్రజలు, రైతులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సూధగాని హరిశంకర్‌గౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్, జెడ్పీటీసీ అనురాధ, ఆలేరు మున్సిపల్ చైర్మన్ శంకరయ్య, మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, బొట్ల యాదగిరి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మాజీ ఎంపీపీ రవీంద్రనాధ్‌గౌడ్, పాపట్ల నరహరి, పుట్ట మల్లేష్, గొల్లపల్లి రాంరెడ్డి, పేరబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్ల బదిలీ

భువనగిరి టౌన్ : జిల్లాలో పలువురు డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లను బదిలీ చేస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చౌటుప్పల్ ఆర్డీఓ జగన్నాథరావు కలెక్టరేట్‌కు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి జహీరాబాద్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. భూ సేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్ శేఖర్ రెడ్డి చౌటుప్పల్ ఆర్డీఓగా, సీసీఎల్ఏలో పనిచేస్తున్న జయశ్రీ జిల్లా కలెక్టర్‌కు రానున్నారు.

తహసీల్దార్లు..

ఆత్మకూర్(ఎం) తహసీల్దార్ అండాలు కలెక్టరేట్‌కు, భూదాన్‌పోచంపల్లి తహసీల్దార్ వీరాబాయిని, కలెక్టరేట్ సూపరింటెండెంట్ గిరిధర్‌ను రంగారెడ్డి జిల్లాకు బదిలీ చేశారు. ఇక రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి యాదాద్రి భువనగిరికి, సంగారెడ్డి నుంచి రవికుమార్ యాదాద్రి భువనగిరి జిల్లాకు రానున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న జి.సైదులు యాదాద్రి భువనగిరి జిల్లాకు బదిలీ అయ్యారు.

ప్రతి మొక్కనూ సంరక్షించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి



ఆరెగూడెం నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి

మోటకొండూర్: నర్సరీల్లో పెంచుతున్న ప్రతి మొక్కనూ సంరక్షించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి సూచించారు. శనివారం మోటకొండూరు మండల కేంద్రంతో పాటు ఆరెగూడెం, గిరిబోయిన గూడెం, సికింద్రనగర్ గ్రామాల్లో నర్సరీలు, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఇంటి అవసరాలకు ఉపయోగపడే మొక్కలను నర్సరీల్లో పెంచాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, నీరు వృథాగా పోకుండా పైపు లైన్ లీకేజీలను అరికట్టాలని, ట్యాంక్‌లను శుభ్రం చేయాలని తెలిపారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి వివిధ పథకాలకు సంబంధించి దరఖాస్తుల డేటా ఎంట్రీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వీరస్వామి, ఎండీ నిరంజన్, ఎంపీఓ కిషన్, భూమండ్ల స్వాతి, చిన్ను సోఫియా పాల్గొన్నారు.

నీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించండి

ఆత్మకూరు(ఎం) : గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సూచించారు. శనివారం ఆత్మకూర్(ఎం) మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి అవసరం మేరకు బోర్లను అద్దెకు తీసుకోవాలని, చేతి పంపులను మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. అనంతరం రాయిపల్లి, సర్వేపల్లి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, నర్సరీల్లో మొక్కలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ ఎండీ నిరంజన్, డిప్యూటీ తహసీల్దార్ షఫియోద్దీన్, ఏపీఓ రమేష్ తదితరులు ఉన్నారు.

ఈవీఎంల తనిఖీ పూర్తవగానే మాక్ పోల్

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, పాల్గొన్న రాజకీయ పార్టీల ప్రతినిధులు

సాక్షి యాదాద్రి : ఈవీఎంల మొదటి దశ తనిఖీ పూర్తి కాగానే మాక్ పోల్ నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు తెలిపారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో అభ్యర్థుల ప్రచారానికి ఉపయోగించే వస్తువులు, వాహనాలు, లౌడ్ స్పీకర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగులు, కటౌట్‌లు, వీడియోగ్రఫీ, స్వాగత తోరణాలు, తదితరాలకు సంబంధించిన ధరలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్ణయించారు. సూచించిన రేట్లకు లోబడి ఎంపీ ఎన్నికల్లో అభ్యర్థులు ఖర్చు చేయవలసి ఉంటుందన్నారు. సమావేశంలో ప్రతినిధులు ఉడుత భాస్కర్, మంగు నరసింహారావు, బట్టు రామచంద్రయ్య, కూర వెంకటేశం, కొలుపుల గణేష్, సయ్యద్ ముల్తానిషా, సోమ రవీందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి కొండపైకి ఆటోలు

- రెండేళ్ల తరువాత అనుమతి
- హర్షం వ్యక్తం చేస్తున్న కార్మికుల కుటుంబాలు



యాదాద్రి కొండపైకి ఆటోలు వెళ్లేందుకు మొదటి ఘాట్ రోడ్డును సిద్ధం చేసిన దృశ్యం

యాదగిరిగుట్ట : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆదివారం నుంచి యాదాద్రి కొండపైకి ఆటోలను అనుమతించనున్నారు. ఇందుకోసం మొదటి ఘాట్ రోడ్డును సిద్ధం చేశారు. రెండేళ్ల అనంతరం కొండపైకి ఆటోలను అనుమతిస్తుండడంతో కార్మికుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రధానాలయం ఉద్ఘాటన నుంచి కొండపైకి ఆటోలను అనుమతించడం లేదు. దీంతో సుమారు 297 కుటుంబాలు జీవనోపాధి కోల్పోయాయి. కొండపైకి ఆటోలను అనుమతించాలంటూ కార్మికులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సుదీర్ఘకాలం ఆందోళనలు చేసినా ఫలితం లేకపోయింది. డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు యాదాద్రి కొండపైకి ఆటోలను అనుమతిస్తామని హామీ ఇచ్చాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆటో కార్మికుల సమస్యను సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించగా సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు ఆటోలను కొండపైకి అనుమతించేందుకు ఏర్పాట్లు చేశారు.

షరతులతో అనుమతి : యాదాద్రి కొండపైకి ఆటోలను మొదటి ఘాట్ రోడ్డు నుంచి అనుమతించనున్నారు. రోజూ 100 ఆటోలకు మాత్రమే అనుమతి ఉంటుంది. మొదటి షిఫ్టు వేకువజామున 3నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 50 ఆటోలు, రెండవ షిఫ్టు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 11 గంటల వరకు మరో 50 ఆటోలు నడవనున్నాయి. అలాగే కొండపైన 25 ఆటోలు, కొండ దిగువన 25 ఆటోలు ఉంటాయి. ఒక్క ఆటోలో ముగ్గురు భక్తులను మాత్రమే తీసుకెళ్లాల్సి ఉంటుంది.

ఆటోలకు నంబర్

కొండపైకి నడిచే ప్రతి ఆటోకు సీరియల్ నంబర్ వేయనున్నారు. దాంతో పాటు పోలీస్ శాఖ కూడా నంబర్ కేటాయిస్తుంది. మొత్తం 297 ఆటోలు ఉండగా రోజూ 100 ఆటోలు రొటేషన్‌గా నడుపుకునేలా ఆటో కార్మిక యూనియన్ నాయకుల మధ్య ఒప్పందం కుదిరింది. ఇదిలా ఉండగా భక్తులను కొండపైకి తీసుకెళ్లినందుకు ఎంత చార్జి వసూలు చేయాలనేది ఇంకా నిర్ణయం కాలేదు. గతంలో ఒక ప్రయాణికుడి నుంచి రూ.20 వసూలు చేసేశారు.

సంతోషంగా ఉంది



ప్రధానాలయ ఉద్ఘాటన జరిగినప్పటి నుంచి ఆటోలను కొండపైకి అనుమతించలేదు. దాదాపు 297 కుటుంబాలు జీవనోపాధి కోల్పోయాయి. కుటుంబాలను పోషించుకోవడానికి అనేక ఇబ్బందులు పడ్డాం. యాదాద్రి కొండపైకి ఆటోలను అనుమతించడం చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు కృతజ్ఞతలు.

–గడ్డమీది దేవేందర్‌గౌడ్, ఆటో కార్మికుడు

ఆర్థికంగా చాలా ఇబ్బంది పడ్డాం



కొండపైకి ఆటోలకు అనుమతించడంతో ఎంతో సంతోషం అనిపిస్తుంది. గతంలో కొండపైకి ఆటోలను తిప్పుతూ వచ్చిన ఆదాయంతో కుటుంబాలను పోషించాం. గత రెండేళ్లుగా అప్పులు చేసి కుటుంబాన్ని పోషించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు ఆటోలను తిరిగి కొండపైకి అనుమతిస్తుండడంతో నాలాంటి కార్మికులకు జీవనోపాధి లభించనుంది. తెచ్చిన అప్పులు తీర్చుకుంటాం.

–కర్రె బీరు మల్లయ్య, ఆటో కార్మికుడు

హక్కుల కోసం ఐక్యంగా పోరాడుదాం

- కరీంనగర్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు



మాట్లాడుతున్న రామకృష్ణారావు, చిత్రంలో సందీప్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, జిట్టా బాలకృష్ణారెడ్డి

భూదాన్‌పోచంపల్లి : కృష్ణా నదీ జలాల్లో తెలంగాణ హక్కులను సాధించుకోవడానికి ఐక్యంగా పోరాడుదామని, ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని భువనగిరి నియోజకవర్గ సమన్వయకర్త, కరీంనగర్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రామకృష్ణారావు పిలుపునిచ్చారు. శనివారం భూదాన్‌పోచంపల్లిలో నిర్వహించిన కార్యకర్తలు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం కృష్ణానదీ జలాలపై కేంద్ర ప్రభుత్వ పెత్తనం లేకుండా చేసిందని, కాంగ్రెస్ పార్టీ హక్కులను కేంద్రానికి అప్పగించి నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల రైతులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. పైగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నెపాన్ని బీఆర్ఎస్‌పై మోపేందుకు ప్రయత్నిస్తుందన్నారు. కృష్ణా జలాల్లో హక్కుల సాధన కోసం ఈనెల 13న నల్లగొండలో కేసీఆర్ హాజరుకానున్న బహిరంగ సభకు పార్టీ కార్యకర్తలు తరలిరావాలని కోరారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి, ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి, చిట్టిపోలు శ్రీనివాస్, గోరంటి శ్రీనివాస్‌రెడ్డి, సామ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పాటి సుధాకర్‌రెడ్డి, సీత వెంకటేశం తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

భువనగిరి క్రైం : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జనగాం జిల్లా నర్మెట్ట మండలం గండిరామవరం ఆవాసం మనుబూతుల తండాకు చెందిన భుక్య జానకిరాం(27) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన జానకిరాం విధులకు హాజరయ్యేందుకు శనివారం బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో భువనగిరి పట్టణంలోని బైపాస్ రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి కొడుకు, కూతురు, భార్య ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. మృతుడి వద్ద లభ్యమైన రూ.లక్ష నగదు, ఐఫోన్‌ను 108 సిబ్బంది పోలీసులకు అప్పగించారు.

పోలీసుల అదుపులో ముగ్గురు దొంగలు

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండలంలో శుక్రవారం సంచలనంగా మారిన పిల్లల అపహరణ ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గ్రామాల్లో సంచరించినది మేకలు ఎత్తుకెళ్లేందుకా లేక పందులను దొంగతనం చేసేందుకా అని పట్టుబడ్డ వ్యక్తులను ప్రశ్నిస్తున్నట్టు తెలిసింది. పందులను దొంగనం చేసేందుకే వారు సంచరించినట్టుగా పోలీసులు విచారణలో గుర్తించినట్టు సమాచారం. పిల్లలను అపహరించే ముఠా సంచరిస్తున్నారనే ప్రచారం మండల వ్యాప్తంగా హల్‌చల్ చేసిన నేపథ్యంలో వాహనంలోని సభ్యులు పందుల దొంగలుగా తేలడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

పందుల దొంగతనంపై మహిళ ఫిర్యాదు

గత నెల 22న తమ పందులు చోరీకి గురయ్యాయని చౌటుప్పల్ మండల పరిధిలోని జైకేసారం గ్రామానికి చెందిన ఒంటెద్దు కృష్ణవేణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వాహనంలో వచ్చి 10వేల విలువైన పెద్ద పందితోపాటు మరో నాలుగు చిన్న పందులను అపహరించారని తెలిపింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన వ్యక్తులు హనుమంతు రవి, హనుమంతు మధు, హనుమంతు రాజులపై ఆమె అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు ఇచ్చింది. అయితే పందుల దొంగతనం విషయంలో వాడిన వాహనం, శుక్రవారం మరోసారి జైకేసారంలో సంచరించినది, పట్టణ కేంద్రంలో స్థానికులు వెంబడించినది ఒకే వాహనం కావడంతో పోలీసులు అదుపులో ఉన్న వ్యక్తులు పందులను ఎత్తుకెళ్లే సభ్యులుగానే తెలుస్తోంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ. 17.50 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- రెండు బైక్‌లు సీజ్
- పరారీలో మరో ముగ్గురు నిందితులు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం : ఉదయం రెక్కీ నిర్వహించి రాత్రి పూట చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద రూ.17.50లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాహుల్ హెగ్డే కేసు వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు సీఐ రాజశేఖర్ సిబ్బందితో సూర్యాపేట పట్టణంలోని లాడ్జిల్లో తనిఖీలు చేపట్టగా ఖమ్మం జిల్లా కేంద్రంలోని బల్లేపల్లి పాండురంగాపురం గ్రామానికి చెందిన సంపటి ఉమాప్రసాద్ పట్టుబడ్డాడని తెలిపారు. అతడిని. పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టగా చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నాడు. ఉమాప్రసాద్ చిన్న వయసులో చదువుకు స్వస్తి పలికి చిన్నచిన్న దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. సూర్యాపేట పట్టణంలో రెండు సంవత్సరాల్లో నిందితుడు 6 దొంగతనాలకు పాల్పడ్డాడన్నాని తెలిపారు. ఇతనికి మరో ముగ్గురు నిందితులు ఖమ్మం జిల్లా కేంద్రంలోని బల్లేపల్లిపాండురంగాపుంకు చెందిన తెల్లనాగు మురుగేశ్, మహ్మద్‌అంజద్‌పాషా, హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరికి చెందిన రోషన్‌కుమార్ సింగ్‌లు సహకరించారని. వీరు పరారీలో ఉన్నారని తెలిపారు. నిందితుడు సంపటి ఉమా ప్రసాద్‌కి 2017 సంవత్సరం వరకు నేర చరిత్ర ఉందన్నారు. జైలు నుంచి బయటకు వచ్చి కూడా పాత వృత్తినే కొనసాగిస్తూ కేరళలో కూడా చోరీలకు పాల్పడ్డాడని తెలిపారు. అక్కడి పోలీసులకు పట్టుబడ్డాడని తెలిపారు. నిందితుడిపై ఖమ్మం జిల్లా, కేరళ రాష్ట్రంలో మొత్తం 12 కేసులు ఉన్నాయన్నారు.

జైలు నుంచి విడుదలై..

కేరళ జైలు నుంచి కొన్ని నెలల క్రితం విడుదలైన ఉమా ప్రసాద్ సూర్యాపేట పట్టణంలోని లాడ్జ్‌లో ఉంటూ చోరీలకు పాల్పడుతున్నాడని తెలిపారు. దొంగిలించిన సొత్తులో కొంత దాచుకొని, మిగితా సొమ్ము తన స్నేహితులైన మురుగేశ్, అంజద్ , రోషన్ లతో కలిసి పంచుకొని, కొంత కుదువపెట్టి ఆ డబ్బులతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని తెలిపారు. ఉమా ప్రసాద్‌ను విచారించగా గత డిసెంబర్ 13నుంచి సూర్యాపేటలో ఉంటూ కృష్ణా కాలనీ, విద్యానగర్, అంజనాపురి కాలనీ, భగత్ సింగ్ నగర్ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. నిందితుడి వద్ద 8 తులాల బంగారు, డైమండ్ ఆభరణాలు, 5700 విదేశీ నోట్లు, ఒక యమహా స్కూటీ, ప్యాషన్ ప్రో బైక్, దొంగతనానికి వాడిన కట్టర్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. దొంగిలించిన మొత్తం సొత్తు విలువ రూ.17,50,000 ఉంటుందని తెలిపారు. నిందితుడు ఉమాప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కేసులను ఛేదించడంలో చాకచక్యత ప్రదర్శించిన సీఐ రాజశేఖర్, ఎస్ఐలు యస్.కె. యాకూబ్, ప్రవీణ్‌కుమార్, కుశలవ, సైదులు, కరుణాకర్, కష్ణ, సైదులు, ఆనంద్, శివ కష్ణ , మధు, సుధాకర్‌ను ఎస్పీ అభినందించారు.

చనిపోతూ.. నలుగురికి ప్రాణదానం

- బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలు దానం


బీరయ్య(ఫైల్)

ఆత్మకూరు(ఎం): బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలను దానం చేసి నలుగురికి ప్రాణదానం చేశారు. ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన మజ్జిగ బీరయ్య (57) ఇటీవల అనారోగ్యం బారిన పడ్డాడు. స్థానిక వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా శనివారం బ్రెయిన్ డెడ్ అయినట్లుగా నిర్ధారించారు. బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందిన బీరయ్య అవయవాలను జీవన్ దాన్ ద్వార దానం చేయడానికి కుటుంబ సభ్యులు అంగీకరించారు. మృతుడికి భువనగిరి మండలం చందుపట్లకు చెందిన అండాలుతో 36 సంవత్సరాల క్రితం వివాహం అయింది. ఇద్దరు కుమారులు. వ్యవసాయ చేస్తూ జీవనం గడపే వాడు. అనంతరం స్వగ్రామం ఆత్మకూరు(ఎం)లో అంత్యక్రియలు నిర్వహించారు. బీర్ల పౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5వేలను, కేహెచ్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 5వేలను మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యాస కవిత, మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్, మాజీ సర్పంచ్ యాస లక్ష్మారెడ్డి, రైతు సమితి మాజీ మండల కోఆర్డినేటర్ యాస ఇంద్రారెడ్డి ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

యాదగిరిగుట్ట: అనారోగ్య కారణాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. యాదగిరిగుట్ట పట్టణంలోని యాదగిరిపల్లిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో శుక్రవారం సుమారు 45 సంవత్సరాలు వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి స్పృహ తప్పి పడిపోయాడు. విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ రంగరావు గుర్తించి 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రిలో చేర్పించాడు. అతను చికిత్స అందిస్తున్న క్రమంలో మృతి చెందా డని శనివారం సీఐ రమేష్ వెల్లడించారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచినట్లు సీఐ పేర్కొన్నారు.

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ

భువనగిరి క్రైం : బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతమైంది. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు బాలుడిని క్షేమంగా శనివారం తల్లిదండ్రులకు అప్పగించారు. నిజామాబాద్ జిల్లాలోని రాతాల రాంరెడ్డి గ్రామానికి చెందిన బైండ్ల చిన్నరాజు, తన భార్య రాధమ్మ కుమారుడు సిద్ధిరాముడు, సోదరి రాజేశ్వరితో కలిసి జీవనోపాధి నిమిత్తం ఈ నెల 4న భువనగిరి పట్టణానికి వచ్చారు. రాత్రి కావడంతో బస్టాండ్ ఎదురుగా ఉన్న బట్టల దుకాణం ముందు పడుకున్నారు.అయితే, బీబీనగర్ మండలంలోని గాద్రాల దండి గ్రామానికి చెందిన బానోతు మోహన్‌కు ఇద్దరు ఆడపిల్లలు సంతానం. భార్యకు గర్భసంచి తీసివేశారు. అతనికి మగ పిల్లవాడు సంతానం కావాలని తెలిసిన వారు ఎవరైనా ఉంటే చెప్పమని డబ్బులు ఇస్తామని చెప్పేవాడు. రాయగిరి స్టేషన్‌కు చెందిన దూరపు బంధువైన పాల్త్య విజయ, ఓరుగంటి శమంతలు భువనగిరి పట్టణంలోని ఓ గ్లాస్ కంపెనీలో పనిచేస్తున్నారు. మోహన్ కోరిక మేరకు పాల్త్య విజయ సదరు బాలుడిని అపహరించి మోహన్‌కు అప్పగించారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ముగ్గురు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు.కిడ్నాప్‌కు నిందితుడు ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకుని, బాలుడిని వారి వద్ద నుంచి తీసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. కేసును ఛేదించిన సీఐ సురేష్‌కుమార్, ఎస్ఐ నాగరాజు, సిబ్బందిని పోలీస్ కమిషన్ సుధీర్‌బాబు అభినందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీ లక్ష్మీనరసింహ స్వామి నిత్య శాశ్వత కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో శనివారం ఉదయం సుప్రభాత సేవ, నిత్యాగ్నిహోత్రి, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్ర నామార్చన, అమ్మవార్లకు సహస్ర కుంమార్చనలు, ప్రత్యేక పూజలు జరిపించారు. ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రక్తికట్టించారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, పంచగన్య ప్రాశన, మధుపర్క పూజ మాంగళ్యధారణ నిర్వహించారు.

'గ్యారంటీ' బడ్జెట్‌పై హర్షం

రుణమాఫీ ప్రస్తావన లేకపోవడం, సాగునీటికి అరకొర కేటాయింపులపై అసంతృప్తి

రాష్ట్ర అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై ఆయా వర్గాల నుంచి మిశ్రమ స్పందన లభిస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారెంటీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంపై హర్షం వ్యక్తం అవుతోంది. కానీ రైతు రుణమాఫీ ఊసు లేకపోవడం, ప్రాజెక్టులకు అరకొరగా నిధుల కేటాయింపుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. – సాక్షి నెట్‌వర్క్

కేటాయించిన నిధులు ఖర్చు చేయాలి



గత ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపు చేసి వాటిలో రెండు శాతం నిధులు కూడా ఖర్చు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా రంగాలకు కేటాయించిన బడ్జెట్ పూర్తి స్థాయిలో ఖర్చు చేయాలి. రుణాలు మంజూరు చేసి ఆయా రంగాల్లో ఉన్న వారికి ఆర్థిక చేయూతనివ్వాలి.

– ఏశాల అశోక్, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి

రైతులకు మేలు జరిగేలా ఉంది



రాష్ట్రంలోని వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో సముచిత స్థానం కల్పించింది. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు నీటి పారుదల శాఖకు రూ.28,024 కోట్లు కేటాయించడం హర్షించదగ్గ విషయం. ఈసారి సాగునీటి కాల్వల మరమ్మతు సమస్య తొలగిపోతుందని భావిస్తున్నాం.

– మల్లారెడ్డి, రైతు, నీలంబావి గ్రామం, బీబీనగర్ మండలం

ఎన్నికల బడ్జెట్ మాదిరిగా ఉంది



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం అంకెల గారిడీగా ఉంది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ఉద్దేశంతో ప్రవేశ పెట్టినట్లు ఉంది. గత ప్రభుత్వం మాదిరిగానే ఎక్కువ మొత్తంలో కేటాయింపు చేసి నిధులు దారి మళ్లించే అవకాశం ఉంది. వ్యవసాయ రంగానికి తక్కువగా కేటాయింపు చేశారు. రుణామాఫీ, రైతుబంధుకు ఈ నిధులు సరిపోవు. ఎన్నికల్లో ఇచ్చిన కొన్ని హామీల అమలుకు బడ్జెట్ కేటాయించలేదు.

– పాశం భాస్కర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

రూ. 500 గ్యాస్ ఎంతో ఉపయోగకరం



సబ్సిడీ గ్యాస్ పథకం పేద మహిళలకు ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పుడు గ్యాస్ సిలిండర్ రూ.వెయ్యి అవుతోంది. సిలిండర్ ధర భారంగా మారడంతో చాలా మంది గ్రామీణ మహిళలు వంట చెరుకును ఆశ్రయించే పరిస్థితి వచ్చింది. రూ.500లకు గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తే పేద కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతుంది.

– ఎడిజర్ల కవిత, నాగినేనిపల్లి, బొమ్మలరామారం మండలం

ప్రజా సంక్షేమ బడ్జెట్



ఇది ప్రజా సంక్షేమ బడ్జెట్. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు చెప్పిన విధంగా బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఇప్పటికే రెండు గ్యారెంటీలను అమలు చేసింది. మరో రెండు గ్యారెంటీలు అమలు చేయడానికి సిద్ధంగా ఉంది. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించింది.

– అండెం సంజీవరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

అరకొర కేటాయింపులే..



ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో అన్ని రంగాలకు అరకొరగానే నిధుల కేటాయింపు ఉంది. రూ.2,75,891 కోట్ల అంచనాతో బడ్జెట్ ప్రవేశపెట్టారు కానీ సంక్షేమ పథకాలకు కొంతమేర నిధుల కేటాయించినా.. ఇతర రంగాలకు మాత్రం తక్కువగానే ఇచ్చారు. కొన్ని రంగాలకే నిధుల కేటాయింపు ఉండడం ఈ బడ్జెట్ అభివృద్ధికి సూచికగా లేదు.

– ఎస్ వెంకటరాజు, అర్థశాస్త్ర అధ్యాపకుడు, భువనగిరి

ఎన్నికల హామీలు నెరవేర్చేలా ఉంది



ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆరు గ్యారంటీ పథకాలకు రూ.53,196 కోట్ల అంచనా వ్యయాన్ని చూపిచడం ఎన్నికల హామీలు నెరవేర్చాలా కనిపిస్తోంది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు కేటాయింపులు పెరిగాయి. మూసీనది ప్రక్షాళనకు రూ.వెయ్యి కోట్లు కేటాయించడం శుభపరిణామం. రానున్న రోజుల్లో కేటాయింపులకు చేసే వ్యయంపైనే బడ్జెట్ తీరుతెన్ను ఆధారపడి ఉంటుంది.

– డాక్టర్ అక్కెనపల్లి మీనయ్య, అర్థశాస్త్ర రిటైర్డ్ అధ్యాపకుడు

గ్యారంటీల అమలు దిశగా బడ్జెట్



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారంటీలను అమలు చేసి ప్రజల మన్ననలు పొందే దిశగా ఈ బడ్జెట్ ఉంది. గత బడ్జెట్‌తో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో సంక్షేమ రంగానికి పెద్ద పీట వేసింది. ప్రజా శ్రేయస్సే ప్రధాన ధ్యేయంగా బడ్జెట్ ఉంది. వాస్తవిక బడ్జెట్‌ను ప్రజల ముందు ఉంచింది. విద్యా రంగానికి ఈసారి ప్రాధాన్యం ఇచ్చారు.

– పాండరయ్య, అర్థశాస్త్రం అధ్యాపకుడు, ఎంజీయూ

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ నల్లగొండ పట్టణంలో పానగల్ బైపాస్ రోడ్డుకు దగ్గరలో మంచి సైజు 40X45 200 చ॥గల పడమర ఫేస్‌గల రెసిడెన్షియల్ ప్లాటు అమ్మబడును. సంప్ర॥ 9866164044 [Y-798419]

■ నల్లగొండ పట్టణంలో MLG రోడ్ అలకాపురి కాలనీ ప్రైమ్‌ఏరియా నందు 39X70 సైజులో 303 చ॥గల ఉత్తరం ఫేస్‌గల ప్లాటు అమ్మబడును. సంప్ర॥ 9866164044 [Y-798420]

HOUSE FOR SALE

■ నల్లగొండ పట్టణం, సాగర్‌రోడ్డు, మారుతినగర్-2 లో 26x50=145 Sq. Yards. West, South : 25 Ft. Road, కార్నర్ న్యూ కన్‌స్ట్రక్షన్ ఇల్లు అమ్మబడును. 55 Lakhs Negotiable సంప్ర॥ 9948281402 [Y-1124460]

FOR SALE

■ యాదాద్రి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో కస్తూర్బా గాంధీ స్కూల్ వెళ్ళే దారిలో మెయిన్ రోడ్‌కు దగ్గరలో అన్ని సదుపాయలతో గల రెండు 2BHK (145 Sq. Yds), East Face బిల్డింగ్స్ సరసమైన రేట్లలో అమ్మకానికి కలవు. డైరెక్ట్ ఓనర్ సేల్ : 9493894343, 9848084343 [Y-784296]

LAND FOR SALE

■ నాగార్జున సాగర్ – మాచర్ల హైవేకి 1 Km దూరంలో మట్టి రోడ్డుకి 4.5 ఎకరాలు, 2 Km దూరంలో డాంబర్ రోడ్డుకి 8 ఎకరాలు అమ్మకానికి కలదు. క్లియర్ టైటిల్. నో బ్రోకర్స్. 15L @ Acre. ఫోన్.8096161336 [HA-14966]

VILLAS FOR SALE

■ **Ready To Occupy Duplex Luxury** 3 BHK - 2340 Sft Villas In The Best Gated Community At Miryalaguda Next To New Dmart, Clubhouse, Swimming Pool, Fully Operational Must See. Call: 8069045560. [H-787931]

Education

■ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed (TTC), B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM, 3 నెలల్లో కోర్స్ పూర్తి చేసే అవకాశం. ఫోన్ 8686977112,339. [HA-14983]

Services

BUSINESS OFFER

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్‌ప్లేట్స్ & LED మిషన్స్ పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం ✆ 9310515624, 8800496710 [G-1433]

Wanted

■ విజయవాడలో A/C & Coolers రెంటల్ (tower-ac.com) కంపెనీకి A/C టెక్నీషియన్స్-3, డోస్ట్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ:18 - 25,000 ట్రైనింగ్ / భోజనం / వసతి ఫ్రీ. ✆ 91771 77244 [B-1255218]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో నర్సులు, కాంపౌండర్స్, లేడీ సూపర్‌వైజర్స్, ఆయాలు, భార్యాభర్తలు & గార్డెన్ వర్క్ ఆవులను చూసుకొనుటకు కావలెను. ఫోన్ 9391036931, 9246585901. [HA-13030]

■ ఈశ్వర్ హోం కేర్ సర్వీస్ HYD, 24 గం॥లు వృద్ధులు, పేషెంట్లు, పిల్లలను చూసుకొనుటకు ఇంటి/వంట పనికి స్త్రీ/పు లు కావలెను. ఫ్రీ వసతి+భోజనం జీ. 16,000/-.ఫోన్. 8977641099/8985115277. [H-787792]

■ ఈ నెల 3వ వారంలో అమెరికా వెళుతున్న మాకు ఇంటి, వంట పనులు చేయుటకు ఆడమనిషి కావలెను. అమెరికా విజిటింగ్ వీసా కలిగినవారు మాత్రమే సంప్రదించగలరు ✆ 92904 15199 [B-790484]

■ **Wanted trained teachers for High School & Primary School. Sub: Science, English, & Maths, Salary Negotiable, Ramannapet 9652531679** [Y-784405]

■ Auro - Cad మరియు టోటల్ స్టేషన్ తో సర్వేయింగ్ చేయగల డిప్లొమా సివిల్ ఇంజనీర్స్ కావలెను. సంప్ర॥ వాస్తురేఖ ఆర్కిటెక్ట్స్ ఇంజనీర్స్ కోదాడ. సెల్ : 98483 96979 [Y-798352]

■ నల్లగొండ పట్టణం SPT మార్కెట్ నందు గల ప్రముఖ మెన్స్‌వేర్ బట్టల షాపు నందు పనిచేయుటకు సేల్స్ గర్ల్స్/బాయ్స్ కావలెను. ఫుల్‌టైం/పార్ట్‌టైం సంప్ర॥ 8374907807 [Y-798423]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233779]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-801571]

■ బాలాజీ గ్రూప్ (A.P, T.S & న్యూఢిల్లీ నెం-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5000/కమీషన్. 9133271122 / 9052671122. [H-787781]

■ పనిమనిషి కావలెను. హైదరాబాద్‌లో డాక్టర్స్ కుటుంబానికి ఇంట్లోనే ఉండి వంట పని మరియు చిన్నపిల్లలను చూసుకొనుటకు 18 నుంచి 30 ఏళ్ళలోపు గల స్త్రీ కావలెను. జీతం : 15,000/- ఫ్రీ భోజనము, వసతి కలదు. వివరాలకు డి.బాలజీ : 92469 69042, 98481 75211 [V- 2393]

■ గుంటూరు వద్ద అడ్వకేట్ ఆఫీసులో ఉండి పని చేయుటకు అనుభవమున్న డ్రైవరు మరియు జూనియర్ లాయరు కావలెను. రూము సౌకర్యం+జీతం 20-25వేలు ✆ 8106719134 / 9346928964 [G-781749]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సీపీఆర్ చేసి.. ప్రాణాలు కాపాడి

- గుండెపోటుకు గురైన మహిళకు ఎస్ఐ తక్షణ సాయం
- ఆస్పత్రికి తరలించగా కోలుకున్న బాధితురాలు
- వలిగొండ ఎస్ఐ మహేందర్ లాల్‌కు అభినందనల వెల్లువ


గుండెపోటుకు గురైన మహిళకు సీపీఆర్ చేస్తున్న ఎస్ఐ మహేందర్ లాల్

వలిగొండ : గుండెపోటుకు గురైన మహిళకు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడాడు.. ఓ ఎస్ఐ. యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి మండలం మన్నెవారిపంపు గ్రామానికి చెందిన బోయిన వెంకటమ్మ శుక్రవారం బంధువులతో కలిసి నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలో శ్రీ పార్వతీరామలింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లారు. దైవ దర్శనం అనంతరం శనివారం స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో వలిగొండ మండల కేంద్రంలో బస్టాండ్‌లో భువనగిరి వైపు వెళ్లే బస్సు కోసం ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో వెంకటమ్మ గుండెపోటుకు గురై కుప్పకూలి అపస్మారకస్థితిలోకి వెళ్లింది. అదే సమయంలో అక్కడికి వచ్చిన వలిగొండ ఎస్ఐ మహేందర్‌లాల్ వెంటనే ఆమెకు సీపీఆర్ చేయడంతో స్పృహలోకి వచ్చింది. వెంటనే ఆ మహిళను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా కోలుకున్నారు. సకాలంలో స్పందించి సీపీఆర్ చేసి మహిళ ప్రాణాలను కాపాడిన ఎస్ఐ మహేందర్ లాల్ను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో ఇంటర్ విద్యార్థిని మృతి


వైష్ణవి (ఫైల్)

సూర్యాపేట రూరల్ : సూర్యాపేట మండలంలోని ఇమాంపేటలోని సాంఘిక సంక్షేమ ఎస్సీ గురుకుల బాలికల పాఠశాలలో శనివారం రాత్రి ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. సూర్యాపేట పట్టణానికి చెందిన వెంకన్న, భాగ్యమ్మల కుమార్తె దగ్గుపాటి వైష్ణవి (17) గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. గురుకుల పాఠశాలలో శనివారం ఫేర్‌వెల్ డే ఉండగా విద్యార్థిని తండ్రి ఉదయం 9గంటలకు వచ్చి పూలు , గాజులు ఇచ్చి వెళ్లాడు. సాయంత్రం పాఠశాల ఆవరణలో జరిగిన ఫేర్‌వెల్ డేలో వైష్ణవి పాల్గొన్నది. అయితే ఈ కార్యక్రమం జరుగుతుండగానే వైష్ణవి హాస్టల్ గదికి వెళ్లిపోయింది. గంట తర్వాత తోటి విద్యార్థులు వెళ్లి చూడగా వైష్ణవి అపస్మారకస్థితిలో ఉంది. ఈ విషయాన్ని వారు వెంటనే ప్రిన్సిపల్‌తో పాటు సిబ్బందికి చెప్పడంతో వైష్ణవిని సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. హాస్టల్ సిబ్బంది ఈ విషయాన్ని విద్యార్థిని తల్లిదండ్రులకు కూడా తెలియజేయడంతో వారు ఏరియా ఆస్పత్రికి వచ్చారు. తమ కూతురును విగతజీవిగా చూసి బోరున విలపించారు. శనివారం సాయంత్రం పాఠశాలలో జరిగిన ఫేర్‌వెల్ డేకు వెళ్లేందుకు తయారైన తర్వాత వీడియో కాల్ చేసి తమతో నవ్వుతూ మాట్లాడిందని విద్యార్థిని తల్లిదండ్రులు వెంకన్న, భాగ్యమ్మ రోదిస్తూ తెలిపారు. తమ కూతురు కొన్ని రోజుల క్రితం ఇంటికి వచ్చిన సమయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కలిసి ఎలా చదువుతున్నావని పలకరించిందని చెప్పారు. అప్పుడు తమ కూతురు.. హాస్టల్‌లో అన్నం బాగుండడం లేదని, రాళ్లు వస్తున్నాయని చెప్పగా అక్కడి నుంచే మున్సిపల్ చైర్‌పర్సన్ ఫోన్‌లో ప్రిన్సిపల్‌తో మాట్లాడారని చెప్పారు. ఈ విషయం మనసులో పెట్టుకుని తమ కూతురును వేధించారని, దీంతోనే మనస్తాపంతో మృతిచెందిందని, తమ కూతురును హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని వారు ఆరోపించారు. వైష్ణవి మృతదేహంపై గాయాలు ఉండడంతో తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై కళాశాల ప్రిన్సిపల్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. సూర్యాపేట రూరల్ పోలీసులు ఆస్పత్రికి వచ్చి వివరాలు సేకరించారు. సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం హాస్టల్‌కు వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా, వారం రోజుల క్రితం భువనగిరిలోని ఎస్సీ హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్న ఘటన మరుకముందే సూర్యాపేటలో మరో బాలిక అనుమానాస్పదస్థితిలో మృతిచెందడం కలకలం రేపింది.

హోరాహోరీగా కొనసాగుతున్న ఖోఖో పోటీలు


తలపడుతున్న నల్లగొండ-నిజామాబాద్ జట్ల క్రీడాకారులు



తలపడుతున్న ఆదిలాబాద్-నిజామాబాద్ జట్ల క్రీడాకారులు, మెదక్-రంగారెడ్డి జట్లు


తలపడుతున్న మెదక్, రంగారెడ్డి జట్ల క్రీడాకారులు

భువనగిరి : భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరుగుతున్న 56వ సీనియర్ రాష్ట్ర స్థాయి ఖోఖో చాంపియన్ షిప్-2023-24 పోటీలు రెండో రోజైన శనివారం హోరాహోరీగా కొనసాగాయి. ఉదయం 10 గంటల నుంచి రాత్రి పొద్దుపోయే వరకు14 లీగ్ మ్యాచ్‌లను నిర్వహించారు. ఇందులో ఎనిమిది మహిళలు, ఆరు పురుషులకు సంబంధించిన పోటీలు ఉన్నాయి. ఆదివారం చివరి రోజు నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరగనున్నాయి. సాయంత్రం ఫైనల్ మ్యాచ్ అనంతరం విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. రెండో రోజు జరిగిన పోటీల్లో ఎస్ఈ శ్రీనాథ్, డీఈ మల్లికార్జున్, ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు

రెండో రోజు ఈ జట్ల మధ్యనే..

మహిళల లీగ్ పోటీలో రెండో రోజు మహబూబ్ నగర్ ఖమ్మంపై 10-08, రంగారెడ్డి ఆదిలాబాద్ జిల్లా జట్టుపై 08-05,హైదరాబాద్ మెదక్‌పై 13-06, నల్లగొండ నిజామాబాద్‌పై 09-03, మహబూబ్‌నగర్ వరంగల్‌పై 09-01, రంగారెడ్డి కరీంనగర్ పై 13-02, ఖమ్మం నిజామాబాద్‌పై 12-11,ఆదిలాబాద్ మెదక్‌పై 06-05, పురుషుల లీగ్ పోటీల్లో కరీంనగర్ మెదక్ పై 15-11, వరంగల్ నల్లగొండ పై 11-10, ఆదిలాబాద్ నిజామాబాద్‌పై 15-08, ఖమ్మం మహబూబ్‌నగర్ పై 12-08, వరంగల్ హైదరాబాద్ పై 14-12, కరీంనగర్ రంగారెడ్డి జిల్లా జట్టు పై 15-14 పాయింట్ల తేడాతో గెలుపొందాయి.